


పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతుండటంతో పులిచింతల ప్రాజెక్టు సోమవారం సాయంత్రానికి 32.6455 టీఎంసీలకు చేరింది.



త్రికోటేశ్వరునికి వెండి బిందె

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామికి ఎం.శ్రీనివాసరావు, వరలక్ష్మి దంపతులు కొడుకు వినీత్ పుట్టినరోజు సందర్భంగా 649 గ్రాముల వెండి బిందె బహూకరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 515 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

జన నిరసన ‘గళం’

- యువగళం పాదయాత్రపై పెదవి విరుపు
- లోకేష్ చేయాల్సింది క్షమాపణ యాత్ర అంటూ ప్రజల గర్జన
- గతంలో గద్దెనెక్కిస్తే ఏం చేశారంటూ ప్రశ్న
- పల్నాడులో నేటి నుంచి చినబాబు యాత్ర



ఆక్రమణల నుంచి విముక్తి కల్పించిన తర్వాత నీటితో కళకళలాడుతున్న వినుకొండ మంచినీటి చెరువు

సాక్షి, నరసరావుపేట: టీడీపీ అధినేత చంద్రబాబు తనయుడు లోకేష్ యువగళం యాత్రపై పల్నాడు ప్రజలు నిరసన గళమెత్తుతున్నారు. గతంలో గద్దెనెక్కిస్తే ఈ ప్రాంతానికి ఏం చేశారని ప్రశ్నిస్తున్నారు. మంగళవారం నుంచి జిల్లాలో పాదయాత్ర చేయనున్న లోకేష్‌ను నిలదీసేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో తమను మోసం చేసినందుకు ముందు క్షమాపణ చెప్పి తర్వాత యాత్ర చేపట్టాలని సూచిస్తున్నారు.

నాలుగు శాఖలకు మంత్రిగా పనిచేసి..

దొడ్డిదారిలో గత ప్రభుత్వంలో నాలుగు శాఖలకు మంత్రిగా పనిచేసిన నారా లోకేష్, 14 ఏళ్లు రాష్ట్రానికి సీఎంగా చేసిన చంద్రబాబు పల్నాడుకు ఒరగబెట్టిందేమీ లేదు. 2014 ఎన్నికల్లో పల్నాడు ప్రజలు టీడీపీకి అండగా నిలిచారు. ఐదు అసెంబ్లీ, ఓ లోక్‌సభస్థానం ఆ పార్టీకి కట్టబెట్టారు. అయినా ఈ ప్రాంతానికి టీడీపీ ప్రభుత్వం ఏమీ చేయలేదు. వినుకొండ, మాచర్ల ప్రాంతాల్లోని ప్రజలకు కనీసం తాగడానికి గుక్కెడు మంచినీటిని అందించిన పాపానపోలేదు. సుమారు 2.78 లక్షల మంది రైతు కుటుంబాలకు రుణమాఫీ చేస్తానని హామీనిచ్చి చంద్రబాబు మోసం చేశారు. వందలాది హామీలను తుంగలో తొక్కారు. అందుకే ప్రజలు 2019లో ఓటుతో బుద్ధిచెప్పారు. ఆ పార్టీకి ఈ ప్రాంతంలో ఉనికే లేకుండా చేశారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజలను మోసం చేసేందుకు లోకేష్ యువగళం పాదయాత్ర చేపట్టారు. మంగళవారం నుంచి నూజెండ్ల మండలం ముప్పారాజువారిపాలెం నుంచి యాత్రను ప్రారంభించనున్నారు.

చంద్రబాబు హయాం అంతా అన్యాయమే

వినుకొండ, మాచర్ల ప్రాంతాల్లో చాలా గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి ఉంటుంది. 2014 ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే ప్రతి గ్రామానికి తాగునీటిని అందిస్తామని హామీనిచ్చి గద్దెనెక్కిన తర్వాత మరిచారు. వినుకొండలో ట్యాంకర్లతో తాగునీరు సరఫరాకు నెలకు రూ. 4 కోట్లు ఖర్చు చేశామని లెక్కలు చూపి టీడీపీ కార్యకర్తలే భారీమొత్తంలో మున్సిపల్ నిధులు దోచేశారు. ప్రజలకు తాగునీరు అందలేదు. వరికపూడిసెల ప్రాజెక్టుకు చంద్రబాబు 1996, 2019లలో రెండు సార్లు శంకుస్థాపన చేశారు. అటవీ, వైల్డ్‌లైఫ్ అనుమతులను కేంద్రం నుంచి తీసుకోకుండా రైతులను మభ్యపెట్టేందుకే శిలాఫలకాలతో షో చేశారు. బాబు హయాంలో గిట్టుబాటు ధర లభించక రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. పంట నష్టపోయిన రైతులకు పైసా పరిహారం అందలేదు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వినుకొండ పట్టణంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించారు. గతంలో 10 ఎకరాల్లో కుచించుకుపోయిన మంచినీటి చెరువు ఆక్రమణలు తొలగించి 280 ఎకరాలకు విస్తరించి ప్రజల తాగునీటి సమస్య పరిష్కరించారు. రూ.209.17 కోట్లతో జేజేఎం, రూ.1,200 కోట్లతో వాటర్‌గ్రిడ్ పనులు చేపట్టారు. గతంలో చంద్రబాబు వినుకొండకు హార్టికల్చర్ కళాశాల మంజూరు చేస్తున్నామని చెప్పి ఐదేళ్లు కాలం గడిపితే వైఎస్ జగన్ అధికారం చేపట్టాక వినుకొండలో హార్టికల్చర్ కళాశాల ఏర్పాటుకు అనుమతులు తీసుకువచ్చారు. వచ్చే ఏడాది నుంచి తరగతులు ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నారు.

- పల్నాడు ప్రాంత రైతులకు వరప్రదాయిని వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణానికి అన్ని అనుమతులనూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకువచ్చింది. త్వరలో పనులు ప్రారంభించనుంది.
- వైఎస్ జగన్ ప్రభుత్వంలో రైతులకు గిట్టుబాటు ధర అందుతోంది. ప్రకృతివైపరీత్యాలు సంభవిస్తే కర్షకులకు నాలుగునెలల్లోనే నష్టపరిహారం లభిస్తోంది. ఉచిత పంటల బీమా పథకం దిగ్విజయంగా అమలవుతోంది.

ఆర్‌ఓ ప్లాంట్ పథకం ఎక్కడ లోకేష్!

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖల మంత్రిగా ఉన్న సమయంలో జూన్ 5, 2018న రూ.9.91 కోట్లతో వినుకొండ రూరల్, శావల్యాపురం, నూజెండ్ల మండలాల్లో 110 గ్రామాలకు తాగునీరు అందించేందుకు ఎన్టీఆర్ సుజల ఆర్‌ఓ ప్లాంట్ పథకం నిర్మాణం లోకేష్ ప్రారంభించారు. అయితే ప్లాంట్ పనులు పూర్తి చేయలేదు. ఆగిపోయిన నిర్మాణాల మధ్య శిలాఫలకం అలంకారప్రాయంగా దర్శనమిస్తోంది. దీనిని లోకేష్ ఓసారి చూసివెళ్లాలని స్థానికులు ఎద్దేవా చేస్తున్నారు.



ఆర్వోప్లాంట్ పథకం కోసం తిమ్మాయపాలెం వద్ద టీడీపీ వేసిన శిలాఫలకం →

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ల నియామకం



ఆళ్ల అయోధ్యరామిరెడ్డి



మర్రి రాజశేఖర్

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): వైఎస్సార్ సీపీ గుంటూరు, విజయవాడ, మచిలీపట్నం రీజినల్ కో–ఆర్డినేటర్లుగా రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌లను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈమేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి సోమవారం ఆదేశాలు వెలువడ్డాయి. దీంతో ఇకపై గుంటూరు, విజయవాడ, మచిలీపట్నం పార్లమెంటరీ జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్లుగా ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ వ్యవహరించనున్నారు.

నేటి ఉదయం నుంచే పింఛన్ కానుక పంపిణీ

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో 2,67,487 మందికి మంగళవారం ఉదయం ఐదు గంటల నుంచే సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేయనున్నట్టు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు బాలు నాయక్ సోమవారం వెల్లడించారు. వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఒకటో తేదీన ఉదయం ఐదు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటలోపు ప్రతి పెన్షన్‌దారుడి ఇంటి వద్దకు వెళ్లి సక్రమంగా నూరుశాతం పెన్షన్లు పంపిణీ చేస్తారన్నారు. అన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మునిసిపల్ కమిషనర్లకు సూచనలు జారీ చేశామని పేర్కొన్నారు.

19న జెడ్పీ సర్వసభ్య సమావేశం

అదే రోజు స్థాయీ సంఘాల భేటీ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 19న నిర్వహించేందుకు జెడ్పీ పాలకవర్గం నిర్ణయించింది. ఈమేరకు జెడ్పీ సీఈఓ జె.మోహనరావు సోమవారం షెడ్యూల్ విడుదల చేశారు. సర్వసభ్య సమావేశంతోపాటు ఏడు స్థాయీ సంఘ సమావేశాలను అదే రోజున సమావేశపరిచేందుకు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా నిర్ణయించారు. ఈనెల 19న ఉదయం 10 గంటల నుంచి ఆర్థిక–ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య–వైద్యం, మహిళా సంక్షేమం, అభివృద్ధి పనులకు సంబంధించిన ఏడుస్థాయీ సంఘాలు భేటీ కానున్నాయి. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు జెడ్పీ సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, జెడ్పీటీసీలు, ప్రభుత్వ శాఖల అధికారులకు సమావేశాల షెడ్యూల్ పంపించారు.

ఆర్డీగా డాక్టర్ శోభారాణి



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ)గా డాక్టర్ జి.శోభారాణిని నియమిస్తూ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ వి.రామిరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్డీగా పనిచేస్తున్న డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్ పదవీ విరమణ చేయడంతో నరసరావుపేట డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న డాక్టర్ శోభారాణిని ఆర్డీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

31,875 బస్తాల మిర్చి రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 31,875 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 30,259 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 26,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.11,500 నుంచి రూ.20,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.12,000 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,908 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

అమ్మపాలు అమృతం

- నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు
- బాలింతలు, గర్భిణులకు అవగాహన
- జిల్లాలో వారం రోజుల పాటు కార్యక్రమాలు



తల్లిపాల ఆవశ్యకతను తెలియజేసే పోస్టర్

సత్తెనపల్లి: నవ మాసాలు మోసి పండంటి బిడ్డకు జన్మనిచ్చిన తల్లి ఆనందం మాటల్లో చెప్పలేనిది. బిడ్డ భూమిపైకి వచ్చి కళ్లు తెరిచిన తొలి క్షణం చూసేది తల్లి ముఖాన్నే .. వెతికేది తల్లి పాలనే. శిశువు ఆయుష్షు, ఆరోగ్యం పెంచడంలో తల్లిపాలు కీలకపాత్ర పోషిస్తాయి. అమ్మ పాలు అమృతంతో సమానం. కొన్ని అపోహలు.. ఆధునిక పోకడలతో కొందరు వారి బిడ్డలకు శ్రేష్ఠమైన తల్లిపాలను దూరం చేస్తున్నారు. దీంతో శిశు మరణాలు ఏటా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఏటా ఆగస్టు మొదటి వారం(1 నుంచి ఏడో తేదీ వరకు)లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. తల్లిపాల ప్రాముఖ్యం, ముర్రుపాలతో కలిగే ప్రయోజనాల గురించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నారు.

తొలిగంటలోపు పాలు ఎంతో మేలు

పుట్టిన శిశువుకు గంటలోపే తల్లిపాలు తప్పనిసరిగా తాగిస్తే రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. కామెర్లు, టైఫాయిడ్, మలేరియా తదితర వ్యాధులను నిర్మూలించే ఔషధ గుణాలు తల్లి పాలలో ఉన్నాయి. బిడ్డ బరువు పెరిగేందుకు ఇవి దోహద పడతాయి. పగటి పూట ఇచ్చే పాలకన్నా రాత్రిపూట బిడ్డకు పాలిస్తే ఎదుగుదల బాగా ఉంటుంది. ఫలితంగా తల్లికీ, బిడ్డకు మంచి బంధం ఏర్పడుతుంది. పాలిచ్చేటప్పుడు తల్లిఒడిలో వేడి బిడ్డకు చేరి చాల వ్యాధులు దరిచేరకుండా రక్షణ కల్పిస్తుంది. పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు తాగిస్తే శిశు మరణాలు తగ్గుతున్నట్లు అధ్యయనాల ద్వారా వెల్లడైంది.

రొమ్ము క్యాన్సర్ దూరం

ప్రస్తుతం అనేక మంది మహిళలు రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారు. దీనికి ముఖ్య కారణం బిడ్డకు పాలివ్వకపోవడమే. శిశువుకు తొలి ఆరు నెలలు పాలివ్వడం ద్వారా తల్లి రొమ్ము క్యాన్సర్ బారినపడే అవకాశాలు చాలావరకు తగ్గుతాయి.

తల్లిపాలతో బిడ్డ ఆరోగ్యం



పుట్టిన ఆరు నెలల వరకు తల్లిపాలు ఇస్తే బిడ్డ ఆరోగ్యంగా పెరుగుతుంది. బాలింతలు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా రోజుకు 10 నుంచి 12 సార్లు బిడ్డకు పాలు ఇవ్వాలి. బిడ్డ ఏడ్చిన ప్రతిసారీ పట్టించవచ్చు. బిడ్డకు పాలు పడుకొని ఇవ్వరాదు. కూర్చొని పట్టాలి.

– డాక్టర్ లక్ష్మణరావు, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్, సత్తెనపల్లి

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన



గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యంపై అవగాహన కల్పిస్తున్నాం. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి గర్భిణికి, బాలింతకు తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాం.

– బి.అరుణ, పీడీ, ఐసీడీఎస్, పల్నాడు జిల్లా

మిర్చి యార్డు చైర్మన్ రాజనారాయణ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న మిర్చి యార్డు చైర్మన్ రాజనారాయణ

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డు కొత్త చైర్మన్‌గా నిమ్మకాయల రాజనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పలు ఫైళ్లపై సంతకాలు చేశారు. యార్డును పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమపై నమ్మకంతో ఆసియా ఖండంలోనే అతి పెద్ద మార్కెట్ యార్డుకు చైర్మన్‌గా ఎంపిక చేశారని, సీఎం నమ్మకాన్ని వమ్ము చేయకుండా మిర్చి యార్డును ప్రథమస్థానంలో నిలిపేందుకు అందరి సహకారంతో శక్తి వంచన లేకుండా తమ పాలకవర్గం కృషి చేస్తోందని చెప్పారు. గుంటూరు మార్కెట్ యార్డులో ఏడాదికి రూ.10 వేల కోట్ల టర్నోవర్ జరుగుతోందని, మిర్చి, కారం పొడుల ద్వారా మరో రూ.5 వేల కోట్ల వ్యాపారం జరుగుతోందని వెల్లడించారు. 15 వేల మందికిపైగా జీవనోపాధి కల్పిస్తున్న రైతు సోదరులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామన్నారు. మిర్చి యార్డులో ఉన్న సమస్యలను అధిగమించి రైతులకు నాణ్యమైన సేవలు అందిస్తామని చెప్పారు. పార్టీలకు అతీతంగా యార్డుకు వచ్చే ప్రతి రైతుకూ న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. హమాలీలు, వేమెన్స్ సమస్యలూ పరిష్కరిస్తామని పేర్కొన్నారు. యార్డులో తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. యార్డులో నగదు రహిత లావాదేవీల అమలుకు చర్యలు తీసుకుంటామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీనైన తనకు ఇంత ప్రాధాన్యం ఇచ్చి చైర్మన్‌గా నియమించారని కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రభుత్వంలో బీసీలకు న్యాయం జరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి, యార్డు వైస్ చైర్మన్ షేక్ మాబు సుభానీ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్
- 185 అర్జీలు స్వీకరణ

నరసరావుపేట: ప్రజా సమస్యలు పరిష్కరించడం అధికారుల లక్ష్యమని జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో సోమవారం జగనన్నకు చెబుదాం (స్పందన) ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్‌తోపాటు జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, పల్నాడు అభివృద్ధి మండలి వైస్‌చైర్మన్ గజ్జల శ్రీనివాసరెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. 185 అర్జీలు అందాయి. ప్రజలకు రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో దాతలు అన్నదానం నిర్వహించారు.



మణిపూర్ హింసకు నిరసనగా ప్రదర్శన చేస్తూ కలెక్టరేట్‌కు వచ్చి జేసీకి వినతిపత్రం అందజేస్తున్న క్రైస్తవులు

- మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా పట్టణానికి చెందిన పలువురు క్రైస్తవ సంఘాల ప్రజలు, సంఘ పెద్దలు భారీ ర్యాలీగా వచ్చి జేసీకి వినతి పత్రం అందజేశారు.

వైద్యో వరప్రదాయిని

- 100 పడకల ఏరియా ఆస్పత్రి భవనాలు పూర్తి
- త్వరలో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు
- రూ. 2 కోట్లతో సమకూరిన అత్యాధునిక పరికరాలు
- అదనపు వసతుల కోసం రూ.9.5 కోట్లు మంజూరు
- ట్రామా సెంటర్ ఏర్పాటుకు రూ.2.40 కోట్లతో ప్రతిపాదనలు
- ఫలించిన మంత్రి విడదల రజిని కృషి



ఇదిగో ఈ చిత్రంలో కనిపిస్తున్నది చిలకలూరిపేట ఏరియా వైద్యశాల ఆస్పత్రి భవనాల నిర్మాణం. గత ప్రభుత్వంలో ఇలా పునాదుల దశలోనే నిలిచిపోయింది. అప్పటి పాలకుల కమీషన్ల కక్కుర్తికి, నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం ఈ దృశ్యం.



కళ్లు మిరుమిట్లుగొలుపుతున్న ఈ భవనాలు చిలకలూరిపేట వంద పడకల ఏరియా ఆస్పత్రివి. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల పునాది దశ దాటని వీటిని మంత్రి విడదల రజిని ప్రత్యేక చొరవ తీసుకుని పూర్తిచేయించారు. దీంతో ఆగస్టు 3న ప్రారంభోత్సవానికి అత్యాధునిక వసతులతో సిద్ధమయ్యాయి.

చిలకలూరిపేట: ఆరోగ్యవరప్రదాయిని అందుబాటులోకి రానుంది. సామాన్యుల ఆరోగ్య రక్షకు కొండంత అండ లభించనుంది. మంత్రి విడదల రజిని కృషితో చిలకలూరిపేట ప్రాంత ప్రజల చిరకాలవాంఛ 100 పడకల ప్రభుత్వాస్పత్రి కల సాకారం కానుంది. దీంతో అత్యాధునిక వైద్యం నిరుపేదల చెంతకు చేరువకానుంది. ఎమ్మెల్యేగా గెలుపొందిన నాటి నుంచి ప్రస్తుత రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చొరవ, కృషి వల్లే 100 పడకల ప్రభుత్వాస్పత్రి నిర్మాణ పనులు దిగ్విజయంగా పూర్తయ్యాయి. ఆగస్టు మూడో తేదీన ఆస్పత్రి భవనాలు ప్రారంభం కానున్నాయి.

4.147 ఎకరాల విస్తీర్ణంలో..

ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల సరిహద్దులో జాతీయ రహదారిపై విస్తరించి ఉన్న చిలకలూరిపేట ప్రాంతంలో రోడ్డు ప్రమాదాల శాతం అధికంగా ఉంటుంది. రెండు జిల్లాల ప్రమాద బాధితులతోపాటు, వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చే వారితో ఇక్కడ ఉన్న 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిత్యం కిటకిటలాడుతూ ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇక్కడ 100 పడకల ఏరియా వైద్యశాల కోసం వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నుంచి గత ప్రభుత్వాలకు ఎన్నో వినతులు వెళ్లాయి. అలాంటి పరిస్థితుల్లో గత ప్రభుత్వ హయాంలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి పునాదులు పడినా పనులు మాత్రం ముందుకు సాగలేదు. దీనికి తోడు పాత 30 పడకల ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో ప్రస్తుత పాత భవనానికి వెనుక లోతట్టులో పునాది పనులు నిబంధనలకు విరుద్ధంగా చేశారు. కమీషన్ల కక్కుర్తి తప్ప పనులపై చిత్తశుద్ధి లోపించటంతో కేవలం బేస్‌మెంట్ దశలోనే పనులు ఆగిపోయాయి. విడదల రజిని ఎమ్మెల్యేగా గెలుపొందిన తొలినాళ్లలోనే ఈ లోపాలను గుర్తించి నిబంధనల మేరకు నిర్మాణ పనులు కొనసాగేలా ఆ మేరకు నిధులు మంజూరు చేయించి పనులను పునఃప్రారంభింపజేశారు. ఆమె కృషి ఫలితంగా 4.147 ఎకరాల విస్తీర్ణంలో రూ.18.57 కోట్లతో ప్రభుత్వాస్పత్రి భవనాలు సర్వహంగులతో రూపుదిద్దుకున్నాయి. శంకుస్థాపనకు సిద్ధమయ్యాయి. మరో రూ.రెండు కోట్లతో ఆస్పత్రికి అవసరమైన అత్యాధునిక వైద్య పరికరాలు సమకూరాయి.



ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

అదనపు నిధులు మంజూరు

ప్రభుత్వాస్పత్రి వెనుక భాగంలో ఓగేరువాగు ప్రవహిస్తుంటుంది. ఈ నేపథ్యంలో మంత్రి రజిని సూచనల మేరకు భవనాలను ఎక్కువ ఎత్తులో నిర్మించారు. దీనికితోడు ఎలాంటి వరద ముప్పు లేకుండా ఆస్పత్రి చుట్టూ రిటైనింగ్ వాల్, ఆస్పత్రి ప్రాంగణంలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.9.5 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో ఆస్పత్రికి అవసరమైన అన్ని హంగులూ సమకూరినట్లయింది. ఈనెల 3న ఈ పనులకు శంకుస్థాపన జరగనుంది.

అత్యాధునిక వసతులు

భవన నిర్మాణాలు పూర్తి చేసుకున్న 100 పడకల ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది నియామకాలు చేపట్టారు. 23 మంది వైద్యులు, 73 మంది వైద్య సిబ్బందిని ప్రభుత్వం కేటాయించింది. ఈ ఆస్పత్రి ప్రారంభమైతే రోగులకు 24 గంటలూ వైద్యం అందుబాటులోకి వస్తుంది. మూడు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, ల్యాబ్ సౌకర్యం, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఎనస్తీషియా, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్, ఫిజియోథెరపీ వైద్యులు నిత్యం అందుబాటులో ఉంటారు. 24 మంది స్టాఫ్ నర్సులు, నలుగురు హెడ్ నర్సులు, రేడియోగ్రాఫర్, ల్యాబ్‌టెక్నిషియన్, బయో మెడికల్ ఇంజినీర్ సేవలు అందుబాటులోకి వస్తాయి. మూడు ఆపరేషన్ థియేటర్లు, బ్లడ్ బ్యాంకు, అడ్వాన్స్‌డ్ ఎన్‌బీఎస్‌యూ, ఐసీయూ సేవలు ఇక్కడే లభ్యమవుతాయి. దీంతో ఇప్పటి వరకు అత్యవసర పరిస్థితుల్లో రోగులను గుంటూరుకు తరలించాల్సిన గతి ఉండదు.

ట్రామా కేర్ సెంటర్‌కు ప్రతిపాదనలు

జాతీయ రహదారిపై నిత్యం జరిగే ప్రమాద బాధితులను ఈ ఆస్పత్రికే తీసుకువస్తుంటారు. ఈ నేపథ్యంలో 100 పడకల ప్రభుత్వాస్పత్రికి అనుబంధంగా ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు మంత్రి రజిని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు వచ్చి రూ.2.40 కోట్లతో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. ఇవి త్వరలోనే మంజూరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో రోడ్డు ప్రమాద బాధితులకు ప్రాణ రక్షణ లభించనుంది.

మోడల్ ఆస్పత్రిగా తీర్చిదిద్దుతాం

ఆస్పత్రి భవనాల నిర్మాణం పూర్తయింది. ఆగస్టు 3న ప్రారంభించి ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువస్తాం. అవసరమైన నిధులు అడిగిన ప్రతిసారీ వెంటనే మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. ఈ ఆస్పత్రిని మోడల్‌గా తీర్చిదిద్దుతాం.

– విడదల రజిని, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి

3న ప్రారంభం

ఆగస్టు మూడో తేదీన ఆస్పత్రి ప్రారంభించాలని రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఆదేశించారు. భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇప్పటికే నియమితులైన వైద్యులు పాత ఆస్పత్రి భవనంలో వైద్య సేవలు అందిస్తున్నారు. కొత్త భవనం ప్రారంభమైతే అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి.

– డాక్టర్ కేవీ లక్ష్మీకుమారి, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్

అధ్యాపకుల వయోపరిమితి పెంపు హర్షణీయం

- మెరుగైన సేవలకు దోహదం
- వీసీ ఆచార్య రాజశేఖర్
- సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం


యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అధ్యాపకులు

ఏఎన్‌యూ: యూజీసీ పే స్కేల్ పొందుతున్న రెగ్యులర్ అధ్యాపకుల వయోపరిమితిని 65 ఏళ్లకు పెంచడం హర్షణీయమని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో పలు యూనివర్సిటీలు, ఉన్నత విద్యా సంస్థల్లో యూజీసీ పే స్కేల్ పొందుతున్న రెగ్యులర్ అధ్యాపకుల వయోపరిమితిని 65 ఏళ్లకు పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ యూనివర్సిటీ అధ్యాపక సంఘం నూటా ఆధ్వర్యంలో సోమవారం యూనివర్సిటీలో కృతజ్ఞతాభివందన సభ నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ అధ్యాపకుల వయోపరిమితి పెంపు వలన విద్యార్థులకు మరిన్ని సేవలు అందించే అవకాశం కలుగుతుందని చెప్పారు. ఉన్నత విద్యలో రాష్ట్ర వ్యాప్తంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రెగ్యులర్ అధ్యాపకుల నియామకాలు జరిగాయని, నేడు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అధ్యాపకుల పదవీ విరమణ వయోపరిమితి పెంపు జరిగిందన్నారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద్ మూర్తి మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోనే ఆంధ్రప్రదేశ్‌తో అధ్యాపకుల వయోపరిమితిపై గొప్ప నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ మాట్లాడుతూ ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకోవడం శుభ పరిణామమన్నారు. నూటా అధ్యక్షుడు డాక్టర్ బి.నాగరాజు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్ధయ్య, నూటా కార్యవర్గ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం..

సభకు ముందు నూటా ఆధ్వర్యంలో యూనివర్సిటీలోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి నూటా పాలకవర్గ సభ్యులు, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించండి

- జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి
- జగనన్నకు చెబుదాంలో అర్జీల స్వీకరణ


బాధితులు చెబుతున్న సమస్యను వింటున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ప్రజల నుంచి కుటుంబ, ఆర్థిక, ఆస్తి, తదితర సమస్యలకు సంబంధించి 62 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ విధంగా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు. ప్రజలకు వారి ఫిర్యాదులను రాసిపెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయ సహకారాలు అందించారు. విచ్చేసిన ప్రజలకు నరసరావుపేట పట్టణానికి చెందిన సీమాంధ్ర డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి కె.పి రంగారావు, అన్నదాన ఆర్గనైజర్ ప్రవల్లికా సత్యంలు నూతనంగా ఏర్పాటుచేసిన భోజనశాలలో ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీతోపాటు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఇతర అధికారులు భోజనాలు వడ్డించారు. అదనపు అడ్మిన్ ఎస్పీ ఆర్.రాఘవేంద్ర, ఏఆర్ అదనపు ఎస్పీ డి రామచంద్రరాజు, క్రైమ్ అదనపు ఎస్పీ ఎస్.కె చంద్రశేఖర్, డీఎస్పీలు కె.వి మహేష్, పల్లపు రాజు, బి.ఆదినారాయణ, యు.రవిచంద్ర, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక కట్నంకోసం హింసిస్తున్నారు

నాకు నాలుగేళ్ల కిందట నవీన్‌కృష్ణతో వివాహమైంది. భర్త, అతని తరపు బంధువులు ఐదు నెలల తర్వాత నుంచి అధిక కట్నం కోసం శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయండి.

–ఓ మహిళ, పసుమర్రు, చిలకలూరిపేట మండలం

పొలం కాజేయాలని చూస్తున్నారు

నేను పూర్వకాలం నుంచి 2.28 ఎకరాల ప్రభుత్వ భూమిని సాగుచేసుకుంటున్నా. ఆ పొలాన్ని కాజేయాలని ఉద్దేశంతో గ్రామానికి చెందిన వ్యక్తి మూడేళ్ల నుంచి పంట వేయనివ్వకుండా, పంట వేస్తే దున్నివేస్తూ చంపుతామని బెదిరిస్తూ గొడవలు పెట్టుకుంటున్నాడు. అతడి నుంచి రక్షణ కల్పించి న్యాయం చేయండి.

–రుద్రమల రామయ్య, వేమవరం, మాచవరం మండలం

సహాయం చేస్తానని మోసం చేశాడు

ఓ వ్యక్తి నా భర్త ఆంజనేయులును యాక్సిడెంట్‌కు గురిచేసి కాలు విరగ్గొట్టాడు. మోకాలు దెబ్బతిని వైద్యశాలలో చేరగా సదరు వ్యక్తి వచ్చి కేసు పెట్టొద్దని, సహాయం చేస్తానని హామీ ఇచ్చాడు. తీరా వైద్యం పూర్తయిన దగ్గర నుంచి పట్టించుకోవటం మానేశాడు.

–పసుపులేటి సుబ్బమ్మ, పాపాయపాలెం, బెల్లంకొండ మండలం

ఓ వ్యక్తి మోసం చేశాడు



నాకు నకరికల్లులో ఎకరన్నర పొలం ఉంది. అందులో 80సెంట్లు ఆన్‌లైన్ కాగా, మరో 70 సెంట్లు ఆన్‌లైన్ చేయలేదు. ఓ వ్యక్తి ఆ భూమికి ఐదు లక్షలు ఇస్తానని చెప్పి కేవలం రూ.1.25లక్షలే ఇచ్చి పట్టా తీసుకొని సంతకాలు చేయించుకున్నాడు. మిగతా డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నాడు. ఆ భూమిని రూ.10లక్షలకు అమ్ముకునేందుకు ప్రయత్నం చేస్తున్నాడు. గట్టిగా అడిగితే నాకు, నా మనవరాళ్లకు నోటీసులు పంపిస్తున్నాడు. నా పొలం నాకు ఇప్పించి న్యాయం చేయండి.

–మేడా రాములమ్మ(103), రావిపాడు, నరసరావుపేట మండలం

ఆన్‌లైన్‌లో రూ.12లక్షలకు మోసం

గుర్తు తెలియని వ్యక్తులు నాకు వాట్సాప్‌లో ఫ్రీలాంచింగ్ అని చెప్పి టెలిగ్రామ్ అనే యాప్‌లో జాయిన్ చేశారు. టాస్క్‌ల పేరుతో క్రిప్టో ట్రేడింగ్ అంటూ మొత్తం విడతల వారీగా రూ.12లక్షలు క్రెడిట్ చేయించారు. తిరిగి డబ్బులు అడిగితే మరో రూ.3లక్షలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే నేను చెల్లించిన డబ్బులో కొంతభాగమే వారికి చేరింది. మిగతా డబ్బు బ్యాంకుల్లోనే ఉన్నది. మోసం జరిగిందని గ్రహించి మనీరికవరీ కోసం ప్రయత్నం చేస్తున్నాం. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా నమోదు చేయలేదు. ఎఫ్ఐఆర్ ఉంటేనే మనీ రికవరీ చేస్తామని బ్యాంకు వారు చెబుతున్నారు. అందువలన జరిగిన దానిపై ఎఫ్ఐఆర్ నమోదుచేసి నాకు సహాయం చేయండి.

–గుడిపల్లి అపర్ణ, లింగంగుంట్ల, నరసరావుపేట మండలం

ఎస్పీ కార్యాలయంలో ఉచిత అన్నదాన షెడ్డు ప్రారంభం

ప్రారంభించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి, జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



నరసరావుపేట: జిల్లా పోలీసు కార్యాలయంలో జగనన్నకు చెబుదాంకు హాజరయ్యే ప్రజల ఉచిత అన్నదానం కోసం సుమారు రూ.6లక్షలతో నిర్మించిన షెడ్డును సోమవారం ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి సమక్షంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం సీమాంధ్ర డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేపీ రంగారావు సహకారంతో 250మందికి ఏర్పాటుచేసిన ఉచిత అన్నదానం స్వయంగా వడ్డించారు. షెడ్డు నిర్మించిన దాతలు ప్రవల్లికా సత్యం, లైటింగ్ మధు, చిన్ని శ్రీనివాసరావులను అభినందించారు. తొలుత వారిద్దరూ కార్యాలయ ప్రాంగణంలో పోలీసు సిబ్బంది ఫుడ్‌కౌంటర్ కోసం ఏర్పాటుచేసిన కూరగాయల తోటను పరిశీలించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ రాఘవేంద్ర, పలువురు పోలీసు అధికారులతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు మద్ది రామబ్రహ్మానందరావు, బత్తుల విష్ణు, కపలవాయి శివప్రసాద్ పాల్గొన్నారు.

పురుగుమందు తాగి ఆత్మహత్య

గురజాల : పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురజాలలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం....గురజాలకు చెందిన నెల్లూరి ఈశ్వరరావు (43) పురుగుమందు దుకాణంలో రిప్రజెంటిడ్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. అతని స్నేహితుడు పిడుగురాళ్లకు చెందిన చల్లగుండ్ల రమేష్‌బాబుకు రూ.9లక్షలు అప్పుగా ఇచ్చాడు. డబ్బులు ఇవ్వాలని ఎన్నిమార్లు అడిగినా అతని నుంచి సమాధానం రాకపోవడంతో 30వ తేదీన పిడుగురాళ్ల వెళ్లి రమేష్‌బాబును గట్టిగా అడగ్గా నా వద్ద డబ్బులు లేవు నేను ఇవ్వను నీ ఇష్టం వచ్చింది చేసుకో అని అన్నాడు. దీంతో మనస్తాపం చెందిన ఈశ్వరరావు గురజాల వచ్చి రామాలయం వద్ద పురుగుమందు తాగాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో భార్య నెల్లూరి పద్మావతి బంధువులతో కలసి ఈశ్వరరావును వైద్యశాలకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు కలరు. మృతుడి భార్య పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డెంగీ, మలేరియా వ్యాధులకు తగినన్నీ మందులు

జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ వెల్లడి

నరసరావుపేట: జిల్లాలో 1.14లక్షల మలేరియా పరీక్ష కిట్లు, 2099 డెంగీ పరీక్ష కిట్లు అందుబాటులో ఉన్నాయని జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ వెల్లడించారు. దోమల వల్ల వచ్చే వ్యాధులైన మలేరియా, డెంగీలకు మందులు లేవంటూ ఓ పత్రికలో శనివారం వచ్చిన కథనాన్ని సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో 22,200 క్లోరోక్విన్ మాత్రలు, దాదాపు 15 వేల ప్రిమాక్విన్ మాత్రలు, 1500 ఏసీటీ మాత్రలు అందుబాటులో ఉన్నాయని, ఎక్కడా మందులు, కిట్లకు కొరతలేదని స్పష్టం చేశారు. జిల్లాలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆధ్వర్యంలో జిల్లా మలేరియా అధికారి పర్యవేక్షణలో జిల్లాలోని అన్నీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో దోమల నియంత్రణ, సంబంధిత వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేగా పాటిస్తూ ప్రతి ఆరోగ్య కార్యకర్త, ఆశా కార్యకర్త, ఆరోగ్య పర్యవేక్షకుడు కలసి తనకు కేటాయించిన గృహాలను సందర్శించి వారి ఇంటి లోపల, పరిసరాలను గమనించి దోమలు వృద్ధి చెందే ప్రాంతాలు ఉంటే వాటిని గుర్తిస్తున్నారన్నారు. గృహ యజమానుల సహకారంతో వాటిని తొలగించడమే కాకుండా ఇంటిలోని వారికి వ్యాధులు, దోమల వ్యాప్తిని నివారించే పద్ధతులను వివరిస్తున్నారు.

ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గ ప్రతినిధులు

నరసరావుపేటఈస్ట్: ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షునిగా ఆర్.శ్రీనివాసరెడ్డి (వెన్నాదేవి), ప్రధాన కార్యదర్శిగా ఆర్.గోవిందరాజులు (కాకాని), కోశాధికారిగా బి.వెంకటేశ్వర్లు (బొప్పూడి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గం, డివిజన్, మండలాలకు ఎన్నికైన నూతన కార్యవర్గ ప్రతినిధులను సోమవారం గౌరవాధ్యక్షుడు ఎస్.ఎం.సుభాని ప్రకటించారు. జిల్లా నుంచి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎం.డానియేల్ (నాగవరం), ఏ శ్రీనివాసరెడ్డి (తాళ్లూరు), ఎస్.అన్నపూర్ణ (పాట్లూరు), మహిళా ప్రతినిధిగా కె.పద్మజ (అమీన్‌సాహెబ్‌పాలెం), మున్సిపల్ స్కూల్ ప్రతినిధిగా టి.రవికాంత్ (నరసరావుపేట) ఎన్నికయ్యారు. నరసరావుపేట డివిజన్ అధ్యక్షునిగా కె.వి. రామిరెడ్డి (లింగారావుపాలెం), ప్రధాన కార్యదర్శిగా వి.సాంబానాయక్ (ఏ.ముప్పాళ్ల), సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షునిగా పి.రమేష్ (మాదల), ప్రధానకార్యదర్శిగా ఎస్.నాగేశ్వరరావు (లెనిన్‌నగర్) ఎన్నికయ్యారు. మండలాల కౌన్సిల్ సభ్యులుగా షేక్ రసూల్, ఆర్.గోవిందరాజులు (నరసరావుపేట), టి.నగేష్, బి.వి.ఎల్.ప్రసాద్ (నకరికల్లు), ఐ.వి.మోహన్‌రెడ్డి, వి.వెంకట్రావు (నాదెండ్ల), నరసింహారావు, వి.సాంబానాయక్ (ఈపూరు), ఎస్.అన్నపూర్ణ (శావల్యాపురం), ఎం.సాంబశివరావు, జె.శ్రీనివాసరావు (వినుకొండ), బి.వెంకటేశ్వర్లు, ఎం.కిషోర్ (చిలకలూరిపేట), ఎం.రామారావు, ఐ.వి. నాగమణి (మాచర్ల), జి.రంగరాజు (వెల్దుర్తి), ఆర్.చంద్రశేఖర్ (దుర్గి) ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.తిరుమలేష్, జి.శ్రీనివాస్, పి.జాకబ్ వ్యవహరించారు.

అవకాశాలు ఓపెన్

- సార్వత్రిక విద్యకు పెరుగుతున్న ఆదరణ
- సాధారణ కోర్సులతో సమానంగా గుర్తింపు
- ఇంటి దగ్గర నుంచే చదివే అవకాశం
- టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షలకు దరఖాస్తుల స్వీకరణ
- పల్నాడు జిల్లాలో 43 అక్రిడిడేటెడ్ ఇన్‌స్టిట్యూషన్‌లు


సార్వత్రిక విద్యాలయం ద్వారా చదువుతున్న విద్యార్థులు

సత్తెనపల్లి: జిల్లాలో ఉన్నత విద్య కోసం ఆశపడినా ఆనుకోని అవాంతరాలు, ఆర్థిక ఇబ్బందులతో చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టేసిన వారు అనేక మంది ఉన్నారు. వివాహమైన తర్వాత, పెద్ద వయస్సు వచ్చేసిన తర్వాత చదువు కోలేక పోయాం అని దిగులు పడే వారూ ఉన్నారు. అటువంటి వారి చింత తీర్చేందుకు సార్వత్రిక విద్య (ఓపెన్ స్కూల్) విధానం అందుబాటులో ఉంది. పాఠశాలలో చదువుకునే అవకాశం లేని బాల, బాలికలకు, వయోజనులకు విద్య అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 1991లో ఏపీ ఓపెన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టింది. రోజువారీ కార్యకలాపాలకు ఆటంకం లేకుండా సార్వత్రిక పాఠశాల ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ చదివే అవకాశాన్ని ఏపీ సార్వత్రిక విద్యాపీఠం కల్పిస్తోంది. సార్వత్రిక పాఠశాలలో చదివి ఉత్తీర్ణులయ్యే విద్యార్థులకు ఇచ్చే సర్టిఫికెట్లకు ప్రభుత్వ గుర్తింపు ఉంటుంది. దీంతో ఉన్నత చదువులకు, ఉద్యోగాలు పొందేందుకు అర్హత ఉంటుంది. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు ఎంసెట్, డైట్ సెట్ వంటి పరీక్షలతో పాటు ఇంటర్మీడియట్ అర్హతతో లభించే అన్ని ఉద్యోగాలకూ అర్హులవుతారు.

ఇవీ సబ్జెక్టులు

పదో తరగతికి గ్రూపు–ఎలో ఇంగ్లిషుతోపాటు తెలుగు, హిందీ, తమిళం, ఒరియా తీసుకోవచ్చు. గ్రూపు – బిలో గణితం, సైన్స్, సోషల్ తీసుకోవాలి. ఇంటర్మీడియట్ గ్రూపు–ఎలో ఇంగ్లీషుతోపాటు తెలుగు, హిందీ, తమిళం, ఒరియా తీసుకోవచ్చు. గ్రూపు–బి ప్రధాన సబ్జెక్టుల్లో మూడింటితో కలిపి ఐదు సబ్జెక్టులతో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది. స్టడీ మెటీరియల్ సరఫరా చేస్తారు.

ఐదేళ్లలో పూర్తి చేయాలి

అభ్యాసకులు నిర్ణీత ఐదేళ్లలో తొమ్మిది సార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణులవ్వాలి. ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే వారు మాత్రం టెన్త్ ఉత్తీర్ణులై రెండేళ్లు వ్యవధి ఉంటే ఐదు సబ్జెక్టులూ ఒకేసారి రాసుకునే అవకాశం ఉంటుంది. రెండేళ్ల వ్యవధి లేకపోతే నాలుగు సబ్జెక్టులు రాసి, రెండేళ్లు పూర్తయిన తర్వాత మిగిలిన ఒక సబ్జెక్టు రాసుకోవచ్చు. అడ్మిషన్ పొందిన అనంతరం ఐదేళ్లలో తొమ్మిదిసార్లు పరీక్షలు రాసి, ఉత్తీర్ణత పొందలేక పోతే తిరిగి కొత్తగా అడ్మిషన్ పొందాల్సి ఉంటుంది.

మార్కుల బదలాయింపు

పాఠశాలలో పదో తరగతి, కళాశాలలో ఇంటర్మీడియట్ చదివి ఉత్తీర్ణులు కాలేకపోతున్న వారు కూడా సార్వత్రిక పాఠశాలలో చేరి, సులభంగా ఉండే సబ్జెక్టులు ఎంపిక చేసుకుని టెన్త్, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులయ్యే అవకాశం ఉంటుంది. రెగ్యులర్ టెన్త్, ఇంటర్మీడియట్ ఫెయిలైనప్పటి నుంచి ఐదేళ్లలోపు సార్వత్రిక పాఠశాలలో చేరితే రెగ్యులర్ ఉత్తీర్ణులైన సబ్జెక్టుల నుంచి ఏవైనా రెండు సబ్జెకుల మార్కులను బదలాయించుకునే వీలుంటుంది. టెన్త్ హిందీ మార్కులను మాత్రం బదలాయించరు. ఇలా బదలాయించుకున్న వారు మిగిలిన మూడు సబ్జెక్టుల పరీక్షలూ రాస్తే సరిపోతుంది. మార్కులు బదలాయించుకునే వారు సబ్జెక్టుకు పదో తరగతికి అయితే రూ.100, ఇంటర్మీడియట్‌కు రూ.150 చొప్పున అడ్మిషన్ సమయంలో అదనంగా చెల్లించాలి.

కాంట్రాక్ట్ తరగతులు

ఓపెన్ స్కూల్లో అడ్మిషన్ పొందిన వారికి ప్రతి ఆదివారం, ప్రతి నెలా రెండో శనివారం ఆయా అధ్యయన కేంద్రాల్లో 30 కాంట్రాక్టు తరగతులు నిర్వహిస్తారు. కనీసం 200 కాంట్రాక్టు తరగతులకు హాజరైన వారిని మాత్రమే మార్చి, ఏప్రిల్ నెలల్లో నిర్వహించే పరీక్షలకు అనుమతిస్తారు.

ఇవీ అర్హతలు


- పదో తరగతిలో చేరేందుకు వచ్చే ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి. ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి ఉండదు.
- చదవడం, రాయడం తెలిసి ఉండాలి.
- దరఖాస్తుతోపాటు టీసీ, రికార్డు షీట్, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఇంటర్మీడియట్‌కు 10వ తరగతి మార్కుల జాబితా, టీసీని దరఖాస్తుతోపాటు అందజేయాలి.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, దివ్యాంగులు కుల ధ్రువీకరణతో పాటు దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలను అందజేయాలి.

ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ

జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో నిర్వహించే సార్వత్రిక విద్య ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. దరఖాస్తులు ఈనెల 26 నుంచి స్వీకరిస్తున్నారు. పల్నాడు జిల్లాలో 43 అక్రిడేటెడ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఉన్నాయి. ప్రవేశాలు పొంద గోరే వారు ఆయా అధ్యయన కేంద్రాల్లో ఏఐ కోర్డినేటర్ వద్ద దరఖాస్తు ఆన్‌లైన్ చేయించుకుని, ఏపీ ఆన్‌లైన్ సెంటర్‌లో ఫీజు చెల్లించాలి.

- ఎటువంటి అపరాధ రుసుం లేకుండా సెప్టెంబరు 25వ తేదీలోగా ఆన్‌లైన్ అడ్మిషన్ పొందవచ్చు. రూ .200 అపరాధ రుసుంతో సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ ఐదో తేదీ వరకూ అడ్మిషన్‌కు అవకాశం కల్పిస్తారు.

సార్వత్రిక విద్యాపీఠం ద్వారా చక్కని అవకాశం



ఉన్నత విద్య అభ్యసించాలనుకునే వారికి సార్వత్రిక విద్యాపీఠం ద్వారా చక్కని అవకాశం. రెగ్యులర్ టెన్త్, ఇంటర్ మాదిరిగానే అన్ని రకాల ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు గుర్తింపు ఉంటుంది. చిరుద్యోగాలు చేస్తూ పదోన్నతులు పొందాలనుకునే వారికి మంచి ఉపయోగం. ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు అడ్మిషన్లు మొదలయ్యాయి. ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవచ్చు.

–కనిగిరి సుబ్బారెడ్డి, సార్వత్రిక విద్యాపీఠం కో ఆర్డినేటర్, పల్నాడు జిల్లా

విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తున్నాం

–ఎంపీ మోపిదేవి


విద్యుత్ పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీ మోపిదేవి

నగరం: గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు తెలిపారు. మండలంలోని చినమట్లపూడిలో కోటి రూపాయలతో చేపట్టనున్న విద్యుత్ ఆధునికీకరణ పనులకు సోమవారం భూమిపూజ చేశారు. ఎంపీ మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ సమస్యలతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తన దృష్టికి తీసుకురావడంతో సమస్య పరిష్కారానికి కోటి రూపాయల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నిధులతో నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా రైతులు పంట కాలువలకు సక్రమంగా సాగునీరు రావడం లేదని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందిన ఆయన ఇరిగేషన్ అధికారులకు ఫోన్ చేసి తక్షణమే సాగునీరు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీకృష్ణయ్య, బాపట్ల అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, మాజీ ఎంపీపీ ప్రసాదం వాసుదేవ పాల్గొన్నారు.

బాపట్ల పురపాలక సంఘం
"ఇ.-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన"

ఆర్.ఓ.సి.నెం.516-1/2020/ఇ1 తేది.31-07-2023

బాపట్ల పురపాలక సంఘమునకు సంబంధించిన అభివృద్ధి పనిని చేయుటకుగాను ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు విధానము ద్వారా అర్హత గల రిజిష్టరు కాంట్రాక్టరు దారుల నుండి టెండర్లు కోరబడుచున్నవి. ఇతర వివరములకు www.tender.apeprocurement.gov.in (procurement place) వద్ద చూడగలరు. మరియు ఇతర వివరముల కొరకు కార్యాలయము పనిచేయు వేళలలో సంబంధిత విభాగము నందు అడిగి తెలుసుకొనగలరు.

పనుల సంఖ్య : 1

అంచనా విలువ : రూ॥ 1,43,920,30/–

1) టెండరు బిడ్‌లు ప్రారంభపు తేది	– 01.08.2023 ఉదయం 11.00 గం॥లకు
2) టెండరు బిడ్‌లు వేయుటకు ఆఖరుతేది	– 16.08.2023 ఉదయం 10.00 గం॥లకు
3) టెండరు బిడ్‌లు స్వీకరించు చివరితేది	– 16.08.2023 ఉదయం 11.00 గం॥లకు

సం/– కమీషనరు, బాపట్ల పురపాలక సంఘం